సిఐటియు జిల్లా మహాసభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - చింతలపూడి

ఈనెల 18,19,20 తేదీల్లో ఏలూరులో జరిగే సిఐటియు 12వ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు పట్టణ నాయకులు ఎస్.సూర్యకుమార్ అన్నారు. మండలంలోని ప్రగఢవరంలో మహాసభ కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. అనంతరం ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అపరిష్కృతంగా ఉన్న పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతున్నా కార్మికుల జీతాలు మాత్రం పెరగడం లేదన్నారు. కార్మికుల సమస్యలపై మహాసభలో చర్చించి భవిష్యత్ ప్రణాళిక రూపొందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికుల యూనియన్ గౌరవ అధ్యక్షులు కె.చంద్రశేఖర్‌రెడ్డి, అధ్యక్షకార్యదర్శులు ఆర్.బాలస్వామి, ఎం.ప్రకాశం, జి.శ్రీను పాల్గొన్నారు.

వ్యర్థం..అనర్థం..!

కోళ్ల వ్యర్థాలతో కొల్లేరు కలుషితం
తక్కువ వ్యవధిలో అధిక లాభాలే కారణం
హైదరాబాద్ నుంచి కోడి వ్యర్థాల దిగుమతి
అర్ధరాత్రి సమయాల్లో దొంగచాటుగా రవాణా
అడపాదడపా దాడులతో పోలీసులు సరి
రాజకీయ నాయకుల చెరువులకూ ఇదే మేత..!

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

వ్యర్థాలతో కొల్లేరు నిండిపోతుంది.. కోళ్లవ్యర్థాల మాఫియా కబంధహస్తాల్లో చిక్కుకుని కొల్లేరు అభయారణ్యం విలవిల్లాడుతోంది.. ఆరోగ్యప్రధాయనిగా ఉండాల్సిన మత్స్యసంపదను తన స్వలాభం కోసం విషతుల్యం చేస్తోంది. సంప్రదాయ మేతలకు బదులుగా అధిక దిగుబడులు, అధిక లాభాలకు ఆశపడి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతోంది.

కొల్లేరును కోళ్ల వ్యర్థాల మాఫియా కమ్మేసింది. అర్ధరాత్రి సమయాల్లో దొంగచాటుగా ఇతర ప్రాంతాల నుంచి ఐషర్, బొలేరో వంటి వాహనాల్లో దిగుమతులు చేసుకుని గుట్టుచప్పుడు కాకుండా చేపల చెరువుల్లో మేతగా వేస్తున్నారు. దీన్ని అరికట్టాల్సిన యంత్రాంగం మామూళ్ల మత్తులో జోగుతూ తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తోంది. ఫలితంగా ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఉమ్మడి పశ్చిమ, ఉమ్మడి కృష్ణా జిల్లాల్లో సుమారు 70 వేల ఎకరాల్లో కొల్లేరు విస్తరించి ఉంది. ఈ కొల్లేరులో, దాని అనుబంధ గ్రామాల్లో చేపల సాగు అధికంగా సాగుతోంది. ఇక్కడ నుంచి ఉత్తరప్రదేశ్, కోల్‌కతా, ముంబాయి ఇతర ప్రాంతాలకు ప్రతిరోజూ లారీలతో చేపలను ఎగుమతి చేస్తుంటారు. అయితే ఇటీవల కాలంలో చేపల మేత ధరలు పెరగడంతో ప్రత్యామ్నాయం వైపు కొందరు చేపల చెరువుల రైతులు చూస్తున్నారు. దాన్నే అదునుగా భావించిన కోళ్ల వ్యర్థాల మాఫియా రంగంలోకి దిగింది.

చేపల చెరువుల వద్ద కోళ్ల వ్యర్థాలు

హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం నుంచి కోళ్ల వ్యర్థాలను ఇక్కడకు తరలించి వాటిని చేపలకు మేతగా దిగుమతి చేస్తున్నారు. ఈ మాంసాహారాన్ని తిని ఎదిగే చేపలను వినియోగిస్తే భవిష్యత్తులో భయంకరమైన రోగాల బారిన పడతారని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

పెదపాడు, దెందులూరు మండలాల్లోనే..!

ప్రతిరోజూ అర్ధరాత్రి సమయాల్లో ఐషర్ వ్యాన్‌లలో, బొలేరో వాహనాల్లో పెదపాడు, ఏలూరు, దెందులూరు మండలాల్లోని కొల్లేరు గ్రామాల్లో ఇతర రాష్ట్రాల నుంచి కోళ్ల వ్యర్థాలు వెళ్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. పోలీసుల కదలికలను బట్టి ఈ వాహనాలు రూటు మార్చుకుంటూ ఈ ప్రాంతాలకు తరలిస్తున్నారు. ముఖ్యంగా ప్రతిరోజూ హనుమాన్‌జంక్షన్ మీదుగా కొన్ని, పెరికీడు నుంచి పెదపాడులోకి మరికొన్ని, ఉంగ్రాజవరం నుంచి ఇంకొన్ని వాహనాలు ఈ మండలాల్లోని చెరువుల వద్దకు వస్తున్నాయి. మరికొన్ని విజయరాయి మీదుగా ఏలూరు నగరం మీదుగా పోణంగి, మాదేపల్లి సమీప ప్రాంతాల్లోని చెరువులకు వెళ్తున్నాయని పలువురు చెబుతున్నారు. ఈ వాహనాలు రావడానికి అరగంట ముందునుంచి కొందరు యువకులు ద్విచక్రవాహనాల్లో స్థానికంగా తిరుగుతూ పోలీసులు గస్తీ కాస్తున్నారా? లేదా? లేక ఇతర శాఖల అధికారులేమైనా వాహనాలను పట్టుకునేందుకు కాపుకాశారా? అనేదానిపై రెక్కీ నిర్వహిస్తారు. ఆ తర్వాత కార్లలో ఆ వాహనాల ద్వారా వ్యర్థాలను తరలించే మాఫియా ప్రతినిధులు రంగప్రవేశం చేసి తుది రెక్కీ నిర్వహిస్తారు. అంతా పక్కా అనుకున్న తర్వాత వాహనాలను జిల్లాలోకి రానిస్తున్నారు. ఇన్ని చేసినా పోలీసులు అడపాదడపా దాడులు చేసి వాటిని పట్టుకుంటున్నారు.

తప్పించుకుంటున్నారా..? తప్పిస్తున్నారా..?

ఈ కోళ్ల వ్యర్థాల తరలింపు ఎంతోకాలం నుంచి కొనసాగుతోంది. అయినప్పటికీ దీన్ని అధికారులు అరికట్టలేకపోవడంపై సర్వత్రా విమర్శలూ, అనుమానాలూ వ్యక్తమవుతున్నాయి. ఈ మాఫియాకు అధికారుల అండదండలున్నట్లు పలువురు బాహాటంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. కొందరు రాజకీయ నాయకులు కూడా ఈ మాఫియాలో భాగస్వాములయ్యారని, వారి చెరువులకు కూడా కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్నారని పలువురు చెబుతున్నారు. ఆయా శాఖల అధికారులకు నెలనెలా మామూళ్లు పంపించడం వల్ల వారు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలూ లేకపోలేదు. వాస్తవానికి ఈ వ్యర్థాల రాకపోకలను అడ్డుకోవాలంటే అడ్డుకోవచ్చు. చెరువుల వద్దకు వెళ్తే ఎక్కడ వ్యర్థాలు వేస్తున్నారు? ఎక్కడ వేయ్యడం లేదని గుర్తించడం చాలా సులభం.. కానీ అధికారులు ఆ దిశగా ఏనాడూ అడుగులు వేయలేదు. దీన్నిబట్టే వారు ఇందులో భాగస్వాములయ్యారని పలువురు విమర్శించడం గమనార్హం. అతితక్కువ ధరకు ఈ వర్థాలను హైదరాబాదులో కొనుగోలు చేసి ఇక్కడ కిలోల లెక్క చెరువుల యజమానులకు విక్రయించడం వల్ల అధిక లాభాలు వస్తున్నాయి. ఇటీవల పెదపాడు మండలంలో ఈ వ్యర్థాల తరలింపు విషయంలో వివాదం తలెత్తడంతో ఓ యువకుడు కనిపించకుండా పోయాడు. అతడిని ఈ వ్యర్థాల మాఫియా హతమార్చిందని అతని బంధువులు ఆరోపించడం గమనార్హం.

అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

పకడ్బందీగా ధాన్యం కొనుగోలు

ఈసారి నూతన విధానం అమలు
ప్రత్యేక ప్రొక్యూర్‌మెంట్ మోనటరింగ్ సెల్ ఏర్పాటు
21 రోజుల్లో రైతుల ఖాతాల్లో సొమ్ము
తూకం అనంతరం ర్యాండమ్ పద్ధతిలో రైస్ మిల్లులకు ధాన్యం తరలింపు
అధికారులతో సమీక్షా సమావేశంలో కలెక్టర్ ప్రసన్నవెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు లేకుండా ప్రొక్యూర్‌మెంట్ మోనటరింగ్ ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ చెప్పారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలుపై ప్రాథమిక వ్యవసాయ పరపతి సొసైటీల అధ్యక్షులు, కార్యదర్శులు, రైస్ మిల్లర్స్, ట్రాన్స్ పోర్ట్ అసోషియేషన్, వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖరీఫ్ ధాన్యం కొనుగోలు పకడ్బందీగా ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా చేయాలన్నారు. కొనుగోలులో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. సజావుగా సాఫీగా జరిగేందుకు రెండు నెలలపాటు ప్రొక్యూర్‌మెంట్ మోనటరింగ్ ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. కొన్ని మండలాలకు ప్రత్యేక అధికారులను కూడా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రైతు భరోసా కేంద్రం పరిధిలోని పిఎసిఎస్‌లో సరిపడు గోనె సంచులు అందుబాటులో ఉంచాలన్నారు. ఏ ప్రాంతంలో హార్వెస్టింగ్ అయి ధాన్యం ఏ తేదీన వచ్చేది వంటి అంశాలను ముందుగా పరిగణనలోకి తీసుకుని దానికి అనుగుణంగా సంచుల సరఫరా చేయాలన్నారు. జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 3.8 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించామన్నారు. కొనుగోలు విషయంలో ప్రతీరోజు ముఖ్యమంత్రి కార్యాలయం నుండి జిల్లాల వారీగా పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఉంగుటూరు నియోజకవర్గ పరిధిలో ధాన్యం కోతలు జరుగుతున్నందున తక్షణమే అక్కడ కొనుగోళ్లు ప్రారంభించాలన్నారు. నూతన విధానం వల్ల రైతు ధాన్యం ఏ మిల్లుకు వెళుతుందో తెలియదని తద్వారా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర అందుకోవడంలో రైతు దళారుల మోసానికి గురికారన్నారు. రైతు కళ్లాల నుంచి ధాన్యం వే బ్రిడ్జికి వెళుతుందని అక్కడ నుంచి ర్యాండమ్ పద్ధతిలో కేటాయించిన రైస్ మిల్లుకు ధాన్యం చేరుతుందన్నారు. మిల్లర్లకు సంబంధించి బ్యాంకు గ్యారంటీ విషయంలో ఉన్నతస్థాయి అధికారులతో చర్చించామని, సానుకూల దృక్పథం వచ్చిందని తెలిపారు. జెసి పి.అరుణ్‌బాబు మాట్లాడుతూ తేమ శాతం 17 కంటే తక్కువ ఉండాలన్నారు. పొలంలో రైతు ఆరబెట్టిన ధాన్యాన్ని సేకరించి వే బ్రిడ్జికి తీసుకువెళ్లి తూకం వేసి ఎఫ్‌టిఒ జనరేట్ చేస్తామన్నారు. అక్కడ నుండి ఆయా రైస్ మిల్లులకు ధాన్యం రవాణా అవుతుందన్నారు. ఈ విషయంలో వాలంటీర్ రైతు సహాయకుడిగా పనిచేస్తారన్నారు. ఇప్పటికే ప్రతీ మండలంలో వే బ్రిడ్జిలను గుర్తించామన్నారు. జిల్లాలో ప్రస్తుతం రైస్ మిల్లర్ల వద్ద 50 లక్షలు, పౌర సరఫరాల శాఖ వద్ద మరో 10 లక్షల గోనె సంచులు అందుబాటులో ఉన్నాయన్నారు. సొంత ట్రాక్టర్‌తో ధాన్యం తోలిన రైతులకు రవాణా ఛార్జి ఆ రైతుకే చెల్లింపు జరుగుతుందన్నారు. 21 రోజుల్లో డబ్బు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ఈ సమావేశంలో పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజరు మంజు భార్గవి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి వై.రామకృష్ణ, జిల్లా సహకార శాఖ అధికారి ప్రవీణ, జడ్‌పి సిఇఒ కె.రవికుమార్, డిఎస్‌ఒ రాజు, డిఆర్‌డిఎ పీడీ విజయరాజు, డ్వామా పీడీ డి.రాంబాబు పాల్గొన్నారు.

బోరును పరిశీలిస్తున్న ఎపిడి ప్రఫుల్

'వైఎస్ఆర్ జలకళ'లో అవకతవకలపై విచారణ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

వైఎస్ఆర్ జలకళ పథకంలో అవకతవకలు చోటుచేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో మండలంలోని ఓ రైతు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో విచారణ నిమిత్తం ఎపిడి ప్రఫుల్ బుధవారం జీలుగుమిల్లిలో పర్యటించారు. ఈ పథకంలో వేసిన బోర్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జీలుగుమిల్లిలోని సర్వే నెంబర్17లో మంజూరైన బోర్‌ను 19వ సర్వే నెంబర్‌లో వేసినట్లు బాధితుడు ఉన్నతాధికారులకు ఇటీవల ఫిర్యాదు చేశాడు. దీంతో బోరు ఏర్పాటు చేసిన ప్రాంతాన్ని ఎపిడి స్థానిక అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం స్థానికులతో మాట్లాడి వివరాలు సేకరించారు. ఈ బోరు ఏర్పాటుపై రెవెన్యూ అధికారుల వద్ద నుంచి పూర్తిస్థాయి నివేదిక తీసుకుని అనంతరం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయనతో పాటు ఎపిఒ జాన్ వెస్లీ, సర్పంచి చిర్రి జగదాంబ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎ.రవి

మాతృభాష విద్యావాలంటీర్లను రెన్యువల్ చేయాలి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మాతృభాష విద్యా వాలంటీర్లకు రెండు నెలల గౌరవ వేతనం బకాయిలను చెల్లించి, వారిని రెన్యువల్ చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎ.రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఆదివాసీ విజ్ఞాన కేంద్రంలో మాతృభాష విద్యా వాలంటీర్లకు రెండు రోజుల శిక్షణా తరగతులను ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ తరగతులకు విద్యావాలంటీర్ల సంఘం జిల్లా అధ్యక్షులు కుంజా నవీన్, కార్యదర్శి కురసం పృధ్విరాజు ప్రిన్సిపల్‌గా వ్యవహరించారు. తొలిరోజు 'గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు' అంశంపై అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ మాతృభాషలో గిరిజన బాల్యానికి విద్యా బోధన చేసిన విద్యావాలంటీర్లకు రెండు నెలల వేతనాలు విడుదల చేయాలనీ డిమాండ్ చేశారు. విద్యాసంవత్సరం ప్రారంభమై ఐదు నెలలు గడుస్తున్నా నేటికీ వారిని రెన్యువల్ చేయకపోవడం బాధాకరమన్నారు. గిరిజన సంస్కృతి, ఆచారవ్యవహారాలు విభిన్నమైనవన్నారు. గిరిజనులకు పోడు సాగు చేసుకోవడం, వేటతో తమ గుంపులను పోషించుకునేవారని గుర్తు చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో ఇటీవల ప్రభుత్వం గుర్తించిన పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేయాలన్నారు. స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ, విద్యావాలంటీర్లు సరియం రామసీత, సరియం భవాని, మొడియం స్వాతి, మడకం సీతామహాలక్ష్మి, కరక వెంకటలక్ష్మి, ధర్ముల రాధా, పాయం దుర్గాప్రియాంక, లక్ష్మీప్రసన్న, కురసం గీతాంజలి, సుమలత, మేఘన పాల్గొన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి - భీమడోలు

గ్రంథాలయాల సేవలను వినియోగించుకోవాలని గుండుగొలను శాఖా గ్రంథపాలకులు గారపాటి నాగమణి కోరారు. 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల గోడపత్రికను గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ నల్ల శంకర్, ఇతర ప్రముఖులు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ ఈనెల 14వ తేదీన వారోత్సవాలను సర్పంచి కూర్మా లక్ష్మీరాజ్ కుమార్, ఉప సర్పంచి ముదుండి సూర్యనారాయణరాజు ప్రారంభిస్తారన్నారు. వారోత్సవాల్లో భాగంగా 15వ తేదీన పుస్తక ప్రదర్శన, విద్యార్థులకు మాదకద్రవ్యాల వాడకం వల్ల కలిగే నష్టాలపై వ్యాసరచన పోటీలు, 16వ తేదీన గ్రంథాలయాల ప్రాముఖ్యతపై వక్తృత్వ పోటీలు, 17వ తేదీన అంబేద్కర్ జీవిత విశేషాలపై చిత్రలేఖనం పోటీలు, 18వ తేదీన ఆటలు పోటీలు, 19వ తేదీన 8,9,10 తరగతుల విద్యార్థినులకు దిశా చట్టంపై అవగాహన కార్యక్రమం, 20న వారోత్సవాల ముగింపు కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమాల్లో గుండుగొలను సొసైటీ ఛైర్‌పర్సన్ వివివి.భాస్కర్, ద్వారకాతిరుమల చినవెంకన్న దేవస్థానం పాలకమండలి సభ్యులు చిరువూరి సత్యనారాయణ రాజు పాల్గొంటారని తెలిపారు

'గోద్రేజ్' బాధితులకు న్యాయం చేయండి

ఉద్యానవన శాఖ డీడీ వద్ద ఆయిల్‌పామ్ రైతుల ఆవేదన
కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంలో స్పందించిన అధికారులు
న్యాయం చేస్తామని హామీ
నకిలీ మొక్కలతో మోసపోయామని ఆందోళన

ప్రజాశక్తి - చింతలపూడి

గోద్రెజ్ ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ యాజమాన్యం ఇచ్చిన మొక్కలు నాటి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఉద్యానవన శాఖ డీడీ పాండురంగన్ వద్ద రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తమను ప్రభుత్వం ఆదుకోకపోతే ఆత్మహత్యే శరణ్యం అంటూ గోడును వెళ్లబోసుకున్నారు. తమను ఆదుకోవాలంటూ విజయవాడలోని ఉద్యానవనశాఖ కమిషనరేట్‌లో ఏడాది క్రితం రైతులు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఉన్నతాధికారులు విచారణ నిమిత్తం బుధవారం చింతలపూడి పట్టణంలో ఉద్యానవనశాఖ కార్యాలయం వద్ద ఆయిల్‌పామ్ రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ 2014-15 సంవత్సరంలో గోద్రేజ్ ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ యాజమన్యం తమకు ఆయిల్‌పామ్ మొక్కలు ఇచ్చారని, మొక్కలు ఏపుగా పెరిగినప్పటికీ దిగుబడి మాత్రం రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మొక్కల నాణ్యతాలోపం వల్లే దిగుబడి తగ్గిపోయిందన్నారు. మండలంలో సుమారు 60 ఎకరాల్లో దాదాపు ఇదే పరిస్థితి ఉందని వాపోయారు. శాస్త్రవేత్తలు పరిశీలించి మొక్కల లోపం వల్లే దిగుబడి రావడం లేదని నివేదిక ఇచ్చారని, కానీ తమకు ఎలాంటి న్యాయమూ జరగలేదని డీడీ వద్ద వాపోయారు. ఎకరాకు 12 టన్నుల దిగుబడి రావాల్సి ఉందని, కేవలం రెండు టన్నులు మాత్రమే వస్తుందని, ఎకరాకు రూ.లక్షకు పైగా పెట్టుబడి అవుతుందని, కనీసం పెట్టుబడులు కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. యాజమాన్యాన్ని అడిగితే సరైన సమాధానం చెప్పడం లేదని, ఇందులో ప్రభుత్వానికి కూడా సంబంధం ఉందని, వారితో చర్చించి చేస్తామని చెబుతున్నారని రైతులు మండిపడ్డారు. ఫ్యాక్టరీ ఉన్నతాధికారులు రాకుండా, ఫీల్డ్ అసిస్టెంట్స్ తూతూమంత్రంగా సమావేశం ఏర్పాటు చేయడంతో అధికారులతీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండేళ్లుగా కమిషనర్ చుట్టూ తిరిగితే ఇప్పటికి అధికారులు వచ్చారని, ఈ సమస్య మళ్లీ ఎప్పటికి పరిష్కారం అవుతుందోనని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. దిగుబడి రాని మొక్కలు తీయించి కొత్త మొక్కలు వేయిస్తామని, ఖర్చు కూడా భరించేలా, లీగల్‌గా రైతులకు న్యాయం చేసేందుకు కృషిచేస్తామనిఫ్యాక్టరీ యాజమాన్యం తెలిపింది. దీనికి రైతులు అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం డీడీ మాట్లాడుతూ రైతుల డిమాండ్లను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని చెప్పారు.



ఆయిల్‌పామ్ రైతులతో మాట్లాడుతున్న పాండురంగన్

'స్త్రీ నిధి' రుణాలు సకాలంలో చెల్లించాలి

ప్రజాశక్తి - ముసునూరు

స్త్రీనిధి రుణాల వాయిదాలు సక్రమంగా, పెండింగ్ లేకుండా కట్టాలని స్త్రీనిధి ఎజిఎం శశికుమార్ అన్నారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో మండలంలోని 16 గ్రామాల బుక్ కీపర్లతో పాటు, వెలుగు సీసీలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో కొన్ని ప్రత్యేక కారణాతో నాలుగు గ్రూపుల బుక్ కిపర్ల విషయంలో తేడా ఉండటంతో కొందరివి స్త్రీనిధి రుణాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. స్త్రీనిధి మేనేజర్ గోపీనాథ్ మాట్లాడుతు ఇకమీదట స్త్రీనిధి రుణాలు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. ఎప్పటికప్పుడు త్రైమాసిక, అర్ధ సంవత్సరానికి ఒకసారి పెండింగ్ లిస్టు తయారు చేసి ఇవ్వాలని కోరారు.

పట్టాలివ్వాలని గిరిజనుల ధర్నా

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని కృష్ణాపురం మెట్టభూముల్లో సాగు చేస్తున్న గిరిజనులకు, పేదలకు పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద గిరిజనులు ధర్నా నిర్వహించారు. అనంతరం వినతిపత్రాన్ని తహశీల్దార్ జెవి.సుబ్బారావుకు అందజేశారు.

ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి అనుమోలు మురళీ మాట్లాడుతూ మండలంలోని అల్లూరి సీతారామరాజునగర్‌కు చెందిన పేదలు సర్వే నెంబరు 86లో 2010 నుండి పత్తి, జీడిమామిడి వంటి పంటలు సాగు చేస్తున్నారని, వారికి రెవెన్యూ అధికారులు సాగుపత్రాలు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మడకం కుమారి, వగ్గాల లక్ష్మి, తాటి భూషమ్మ, బరగడ కుమారి, గంగ పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతి అందిస్తున్న గిరిజన మహిళలు

మద్దతు ధర కల్పనకే నూతన కొనుగోలు విధానం

సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ ఎమ్‌డి వీరపాండ్యన్

ప్రజాశక్తి - ఉంగుటూరు

ధాన్యానికి మద్దతు ధర అందించే లక్ష్యంతో ప్రభుత్వం నూతన విధానాన్ని అమలు చేస్తూ రైతుభరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేపట్టనుందని రాష్ట్ర సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ ఎమ్‌డి జి.వీరపాండ్యన్ అన్నారు. బుధవారం మండలంలో చేబ్రోలు, నారాయణపురం, ఉంగుటూరులోని ఆర్‌బికెలు, ధాన్యం కల్లాలను ఆయన పరిశీలించారు. తొలుత చేబ్రోలు, నారాయణపురంలో రైతులు ఆరబెట్టిన ధాన్యం రాశులను పరిశీలించారు. నారాయణపురంలో పలువురు రైతులు మాట్లాడుతూ వారంరోజుల నుంచి ధాన్యం ఆరబెడుతున్నామని, వాతావరణం ఎప్పుడెలా ఉంటుందో తెలియడం లేదని, ధాన్యం కొనుగోలు ఇప్పటికే ప్రారంభించాల్సి ఉందన్నారు. తేమ శాతం 17లోపు రావాలంటే పది, పన్నెండు రోజులు పైనే పడుతోందని, దీంతో బరకాలకు డిమాండ్ పెరిగి అద్దె రూ.20 నుంచి రూ.40, కూలీల ఖర్చు పెరిగి ఆర్థిక భారమవుతుందని తెలిపారు. వెంటనే ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలని కోరారు. శాంపిళ్ల సేకరణ ఉదయం 11 దాటాక తీయాలని రైతులు కోరారు. గడిచిన సీజన్‌లో హమాలీ ఛార్జీలు ఇంతవరకూ ఇవ్వలేదని వాపోయారు. దీనిపై ఎమ్‌డి మాట్లాడుతూ ధాన్యం తోలిన 21 రోజుల్లోపే రవాణా, హమాలీ కూలీల ఖర్చులను కలిపి సంబంధిత రైతు ఖాతాకు జమచేయనున్నామని రైతులు ఆందోళన చెందవద్దన్నారు. అనంతరం ఉంగుటూరు రైతుభరోసా కేంద్రంలో రైతులతో ఆయన సమావేశం నిర్వహించారు. రైతుల సంక్షేమం కోసమే ధాన్యం సేకరణలో కొత్త నిబంధనలు తీసుకువచ్చామన్నారు. ట్రక్ షీట్, ధాన్యం తోలిన తర్వాత ఏ రైస్‌మిల్లుకు చేరాలో అంతా కంప్యూటర్ ఆధారంగా జరుగుతుందన్నారు. సంచులు, ట్రాన్స్ పోర్టు, హమాలీ ఖర్చులు రైతులే పెట్టుకుంటే ఆ విషయాన్ని ముందుగా ఖచ్చితమైన వివరాలతో ఆర్‌బికెల్లో నమోదు చేయించుకోవాలని, అప్పుడు మాత్రమే సొమ్ములు పడతాయన్నారు. నూతన విధానానికి రైతుల సహకరించాలని కోరారు. సంచికి రూ.3.70, వంద కేజీల బస్తాకు హమాలీ ఛార్జి రూ.100 చెల్లించనున్నామని ఆయన రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జెసి అరుణ్‌బాబు, జిల్లా కో ఆపరేటివ్ అధికారి ప్రవీణ, సివిల్ సప్లయీస్ సంస్థ జిల్లా మేనేజర్ మంజుభార్గవి, జిల్లా వ్యవసాయ సంచాలకులు వై.రామకృష్ణ, భీమడోలు ఎడిఎ పి.ఉషారాజకుమారి, జిల్లా వ్యవసాయ మండలి ఛైర్మన్ వి.వెంకటేశ్వరరావు, నారాయణపురం సొసైటీ ఛైర్‌పర్సన్, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు పాపారావుబాబ్జీ, తహశీల్దారు ఎవి.రమణారావు, ఎంపిడిఒ ప్రేమాన్విత పాల్గొన్నారు.

నారాయణపురంలో రైతులతో మాట్లాడుతున్న వీరపాండ్యన్

మళ్లీ వైసిపిదే అధికారం : కోటగిరి

ప్రజాశక్తి - ముదినేపల్లి

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో వైసిపి 175 స్థానాలు కైవసం చేసుకుని మరోసారి అధికారంలోకి వస్తుందని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు ధీమా వ్యక్తం చేశారు. కైకలూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు గడపగడపకూ మనప్రభుత్వం కార్యక్రమం చేపట్టి బుధవారంతో వంద రోజుల మైలురాయి దాటిన సందర్భంగా మండలంలోని చిగురుకోట గ్రామ పార్టీ ఆధ్వర్యంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన శ్రీధర్‌బాబు మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలో ఎక్కడా అమలు చేయడంలేదన్నారు.100 రోజులు పూర్తయిన సందర్భంగా ప్రత్యేక కేక్‌ను కట్ చేశారు. ఈ అనంతరం ఎంపీ, ఎంఎల్‌ఎలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు ఈడే వెంకటేశ్వరమ్మ, వైస్ ఎంపిపిలు సునీత, రాధా, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, పార్టీ మండల అధ్యక్షులు మోట్రు ఏసుబాబు, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షులు కె.విష్ణువర్ధన్, పార్టీశ్రేణులు నిమ్మగడ్డ భిక్షాలు, ఈడే వెంకటేశ్వరరావు, దాకారపు శ్రీనివాసరావు, బొర్రా శేషు, సాయి, ఎస్.రామకృష్ణ, గంటా కోటేశ్వరరావు, కైకలూరు, కలిదిండి, మండవల్లి మండలాల ఎంపిపిలు, జెడ్‌పిటిసి సభ్యులు, ప్రజాప్రతినిధులు, వాలంటీర్ల, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



కేక్ కట్‌చేస్తున్న ప్రజాప్రతినిధులు

ఐద్వా ఆధ్వర్యాన బాలల దినోత్సవ వేడుకలు

ఏలూరు: ఈనెల 14న బాలల దినోత్సవం సందర్భంగా బాల సంఘం, ఐద్వా ఆధ్వర్యంలో వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఐద్వా జిల్లా కన్వీనర్ పి.హైమావతి తెలిపారు. బుధవారం ఉదయం స్థానిక గన్‌బజార్ సెంటర్లో బాలబాలికలకు అటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో నేటి పిల్లలకు మానసిక ఒత్తిడిని ఎదుర్కొనేలా విద్యను అందించాలన్నారు. పిల్లల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసి ప్రోత్సహించాన్నారు. అప్పుడే పిల్లలు చదువుతో పాటు వారికి నచ్చిన రంగాల్లో అభివృద్ధి చెందుతారన్నారు. అలాంటి విద్యను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే చిన్నారులు, మహిళలపై జరుగుతున్న అకృత్యాలను అరికట్టడం కోసం చిన్నతనం నుంచే అబ్బాయిలు, అబ్బాయిలు సమానత్వం అనే ఆలోచన పెంపొందించాలన్నారు. మహిళల పట్ల గౌరవభావం నేర్పాలని సూచించారు. ఈ సందర్భంగా పిల్లలకు పరుగు పందెం, లెమన్ స్పూన్ తదితర పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు పాల్గొన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి - నూజివీడు

గ్రంథాలయ ఉత్సవాలకు నూజివీడు పట్టణంలోని ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయం అన్ని ఏర్పాట్లతో ముస్తాబవుతోంది. ఈ నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించేందుకు సిబ్బంది సకలం సిద్ధం చేస్తున్నారు. ఈ సందర్భంగా నూజివీడు పట్టణంలోని ఎస్ఆర్ఆర్ బాయ్ సాయి స్కూల్ ఆవరణలో ఉన్న ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయ అధికారి బి హెచ్.శ్రీనివాసరావు మాట్లాడుతూ బాలల దినోత్సవం రోజైన నవంబర్ 14వ తేదీన గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, చిన్నారులకు ఫ్యాన్సీ డ్రెస్ కాంపిటీషన్, విద్యార్థుల కోసం పుస్తక ప్రదర్శన, గ్రంథాలయ ఉద్యమ నేతలపై ఉపన్యాసాలు, కవి సమ్మేళనం వంటి కార్యక్రమాలు ఉన్నతాధికారుల ఆదేశానుసారం ప్రణాళిక బద్ధంగా రోజువారి కార్యక్రమాలుగా నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు, యువత నిజమైన విజ్ఞానాన్ని అందించే గ్రంథాలయాల గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పుస్తకాల ద్వారా విజ్ఞానంతో పాటు ఎన్నో పోటీ పరీక్షల్లో విజయం సాధించడంతో ఉపాధి అవకాశాలు మెరుగుగా లభిస్తాయన్నారు. అన్నింటికీ గ్రంథాలయం అందుబాటులో ఉందని, ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. గ్రంథాలయ వారోత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

15 నుంచి కుష్టుపై ఇంటింటా సర్వే

ప్రజాశక్తి - చాట్రాయి

నవంబరు 15వ తేదీ నుంచి డిసెంబర్ ఐదో తేదీ వరకు కుష్టు వ్యాధిపై ఇంటింటి సర్వే నిర్వహించాలని ప్రభుత్వ వైద్యాధికారి షేక్ అఫ్రీన్ సుల్తానా సూచించారు. మండల కేంద్రమైన చాట్రాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎఎన్ఎంలకు, ఆశాకార్యకర్తలకు, ఆసుపత్రి సిబ్బందికి బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుల్తానా మాట్లాడుతూ కుష్టు వ్యాధిని నిర్లక్ష్యం చేసినా, చికిత్స తీసుకోకపోయినా అంగవైకల్యం ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి సర్వే నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో సిహెచ్ఒ జివి.రమణ, సూపర్‌వైజర్లు నిర్మల, జయలక్ష్మి, ఆశా కార్యకర్తలు, ఎఎన్ఎంలు, ఎంఎల్‌పిఒలు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

లోకేష్‌ను కలిసిన కొడాలి వినోద్

ప్రజాశక్తి - ముదినేపల్లి


లోకేష్‌తో కొడాలి వినోద్

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను బుధవారం టిడిపి యువనేత, కైకలూరు నియోజకవర్గ నాయకులు, ముదినేపల్లికి చెందిన కొడాలి వినోద్ మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా లోకేష్ కైకలూరు నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి గురించి వివరాలు అడుగగా, వినోద్ వివరించారు. వచ్చే సాధారణ ఎన్నికల్లో కైకలూరు నియోజకవర్గంలో పార్టీ విజయానికి కృషి చేయాలని లోకేష్ సూచించినట్లు వినోద్ తెలిపారు.

అల్లంచర్ల భూములను పరిరక్షించాలని వినతి

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని అల్లంచర్లరాజుపాలెంలోని సర్వే నెంబర్ 226 భూములను పరిరక్షించాలని కోరుతూ టిడిపి నాయకులు, మాజీ ఎంపిపి శీలం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజారపు అచ్చెంనాయుడును బుధవారం మంగళగిరిలోని టిడిపి ప్రధాన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మండలంలో పార్టీ పరిస్థితులు, సభ్యత్వ నమోదు వంటి విషయాలను చర్చించినట్లు వారు తెలిపారు. ఆయనతో పాటు టిడిపి మండల నాయకులు తోట లక్ష్మీనారాయణ, వాసిరెడ్డి మోహన్, జోనుబోయిన సోంబాబు, సందేపూడి సాయి, గండబోయిన శ్రీను, వాసిరెడ్డి వెంకటేశ్వరరావు ఉన్నారు.

ఓటు హక్కుపై అవగాహన

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని తహశీల్దార్ ఎస్ఎస్.శాంతి చెప్పారు. ఎస్‌విఇఇపి కార్యక్రమంలో భాగంగా బుట్టాయగూడెం ప్రభుత్వ జూనియర్ కాలేజి ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఓటు హక్కు పొందడం వల్ల ప్రజాస్వామ్యంలో ఓటర్ల బాధ్యతను గుర్తు చేశారు. ఓటు హక్కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఏర్పాటుకు ఎంతో ముఖ్యమైన అస్త్రమన్నారు. అనంతరం విద్యార్థులు ర్యాలీ నిర్వహించి, మానవహారం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ గంగరాజు, కళాశాల సిబ్బంది, విఆర్ఒలు పోతురాజు, నాగేశ్వరరావు, ప్రసాద్, సచివాలయం సెక్రటరీ సూరిబాబు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు 'సిద్ధార్థ' విద్యార్థులు

ప్రజాశక్తి - నూజివీడు

నూజివీడు పట్టణంలోని శ్రీ సిద్ధార్థ కళాశాల విద్యార్థులు సిఎం కప్ కబడ్డీ పోటీల్లో జిల్లా జట్టుకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ గొల్లపూడి రవిబాబు తెలిపారు. తమ విద్యాసంస్థల్లోని విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లోనూ ప్రావీణ్యత సాధించడం అభినందనీయమన్నారు. సిఎం కప్ కబడ్డీ జిల్లా జట్టుకు తమ విద్యార్థులు జె.జగదీష్, ఒ.జోజిబాబు, డి.నివాస్ ఎంపికైనట్లు తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థులను ఈ సందర్భంగా ప్రిన్సిపల్ రవిబాబు, అధ్యాపక అధ్యాపకేతర బృందం అభినందించింది. జిల్లా జట్టులో విజయం సాధించి రాష్ట్ర జట్టులో కప్పును కైవసం చేసుకోవాలని ఆకాంక్షించారు.

'ఇడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు రద్దు చేయాలి'

ప్రజాశక్తి - గణపవరం

ఇడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు రద్దు చేయాలని జనాభా దామాష్ ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని కెవిపిఎస్ గణపవరం మండల కమిటీ కార్యదర్శి చిన నాగేశ్వరరావు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పున:సమీక్షించి ఇడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు రుద్దు చేయాలని పేర్కొన్నారు. రిజర్వేషన్ల ప్రాతిపదిక రాజ్యాంగ విలువకు విరుద్ధమని తెలిపారు. తీర్పును పున:సమీక్ష చేయాలని పేర్కొన్నారు.

లారీ ఢీకొని విద్యార్థి దుర్మరణం

ప్రజాశక్తి - ఏలూరు

లారీ ఢీకొని విద్యార్థి మృతి చెందిన ఘటన ఏలూరు శివారు చాటపర్రు వంతెన సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... సుంకరివారితోటకు చెందిన విజయరాజు (12) బుధవారం సాయంత్రం పాఠశాల నుంచి సైకిల్‌పై ఇంటికి బయలుదేరాడు. ఈ క్రమంలో చాటపర్రు వంతెన సమీపంలోకి వచ్చేసరికి లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విజయరాజు మృతి చెందా డు. మృతుని కుటుంబసభ్యులు రోదించిని తీరు చూపరులను కంటతడి పెట్టించింది.

ఆర్‌టిసి బస్సు ఢీకొని గర్భిణి మృతి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ఆర్‌టిసి బస్సు ఢీకొని గర్భిణి మృతి చెందిన సంఘటన బుధవారం మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని లక్ష్మీపురానికి చెందిన గురివింద పోసారావు అతని భార్య పోసిలక్ష్మి (25) కెఆర్.పురం ఆసుపత్రికి వైద్య పరీక్షల నిమిత్తం ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. ఈ క్రమంలో రాజానగరం సమీపంలోకి వచ్చేసరికి పోలవరం నుంచి జంగారెడ్డిగూడెం వైపు వెళ ్న ఆర్‌టిసి బస్సు వారి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తొమ్మిది నెలల గర్భిణి అక్కడికక్కడే మృతి చెందింది.

భార్య కనిపించడంలేదని భర్త ఫిర్యాదు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

భార్య కనిపించడంలేదని భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ వి.చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని పి.అంకంపాలేనికి చెందిన ఘంట పద్మావతి మూడు రోజుల క్రితం అందరూ నిద్రపోతున్న సమయంలో ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయిందని ఆమె భర్త సత్యనారాయణ తెలిపారు. బంధువుల ఇళ్ల వద్ద, చుట్టుపక్కలా వెతికినా ఆమె ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

సంకర్షణపురం గ్రామాభివృద్ధిలో సంకుల వారి కృషి

నిర్మాణమవుతున్న రోడ్డు

ప్రజాశక్తి - ముదినేపల్లి

గ్రామాభివృద్ధిలో సంకుల వారి కుటుంబీకుల పాత్ర ఎనలేనిదని మండలంలోని సంకర్షణపురం గ్రామ సర్పంచి సంకుల వెంకటనాగరాజు తెలిపారు. ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ పదవిలో ఉన్నా, లేకున్నా గ్రామాభివృద్ధిలో తనవంతు పాత్ర పోషించానని చెప్పారు. 2013లో తన భార్య సంకుల హైమావతి సర్పంచిగా పోటీ చేసి గెలుపొందారన్నారు. టిడిపి నాయకుడిగా, గ్రామంలో మౌలిక సౌకర్యాల కల్పనకు, నిధులు మంజూరుకు కృషి చేశానన్నారు. అప్పటి రాష్ట్ర మంత్రి కామినేని శ్రీనివాస్ సహకారంతో గ్రామంలో రూ.70 లక్షలతో సీసీ రోడ్లు వేశామన్నారు. రూ.6 లక్షలతో అంగన్‌వాడీ కేంద్ర భవనం, పంట కాలువపై వంతెన, మంచినీటి చెరువు చుట్టు పెన్సింగ్, ముస్లిం శ్మశానం చుట్టూ రూ.15 లక్షలతో ప్రహారిగోడ నిర్మాణం చేశామన్నారు. దళితవాడ మంచినీటి బావి చుట్టూ రూ.60 వేలతో పల్లెం నిర్మించామన్నారు. తన భార్య హయాంలో రూ.కోటి పైగా ప్రభుత్వ నిధులతో పలు గ్రామాభివృద్ధి పనులు చేశామన్నారు. 2021లో సర్పంచిగా పోటీ చేసే అవకాశం రావడంతో తన ప్రత్యర్థి సంకుల రామమోహనరావుపై 260 ఓట్ల మెజారిటితో సర్పంచిగా గెలుపొందానన్నారు. గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసే లక్ష్యంతో నిరంతరం మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. గ్రామ సమస్యలను దశలవారీగా ప్రాధాన్యత క్రమంలో పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.


సంకుల వెంకటనాగరాజు దంపతులు

చేసిన అభివృద్ధి పనులు

తాను బాధ్యతలు చేపట్టిన తర్వాత రూ.3 లక్షలపైచిలుకు పంచాయతీ ఆర్థిక సంఘం నిధులతో గ్రామ పంచాయతీ ప్రహారిగోడ నిర్మాణం చేశామన్నారు. రూ.1.25 లక్షలతో 125 మీటర్ల పొడవున దళితవాడ శ్మశానానికి వెళ్లే రోడ్డును ఎస్‌జిటి రోడ్డుగా నిర్మాణం చేపట్టామన్నారు. రక్షిత మంచినీటి పథకం కుళాయిలు ద్వారా గ్రామస్తులకు స్వచ్ఛమైన మంచినీటిని రెండు పూటలా సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. వేసవిలో మంచినీటి కొరత లేకుండా 7హెచ్ మోటర్లతో నీటిని తోడి కుళాయిల ద్వారా గ్రామస్తులకు సరఫరా చేస్తున్నామన్నారు.

తీర్మానించిన పనులు

గ్రామంలో రూ.9.20 లక్షలతో సీసీ రోడ్లు నిర్మాణం, రూ.4 లక్షలతో మైక్రో ఫిల్టర్‌బెడ్స్ నిర్మాణం, రూ.10 లక్షలతో దళితవాడలో ఎస్‌సి కమ్యూనిటీ హాలు నిర్మించేందుకు పంచాయతీ తీర్మానం చేసినట్లు తెలిపారు.

చేయాల్సిన అభివృద్ధి పనులు

గ్రామంలో వివిధ ప్రాంతాల్లో పక్కా సీసీ డ్రెయినేజీల నిర్మాణం, జగనన్న ఇళ్లస్థలాల మెరక, వేసవిలో నీటి కొరత లేకుండా ఉండేందుకు మంచినీటి చెరువును లోతుగా తవ్వి నీటిని నిల్వ చేసేందుకు చర్యలు, మెటల్, సీసీ రోడ్ల నిర్మాణం, మంచినీటి చెరువు చుట్టూ పెన్సింగ్ ఏర్పాటు, ముస్లిం శ్మశానవాటికకు రోడ్డు నిర్మాణం, హిందూ, ఎస్‌సి శ్మశానవాటికలకు ప్రహారిగోడలు నిర్మాణం చేపట్టాలన్నారు. ప్రభుత్వం నుంచి పంచాయతీలకు వచ్చే నిధుల లభ్యతను బట్టి ప్రాధాన్యత క్రమంలో గ్రామాభివృద్ధి పనులు చేపడతానని చెప్పారు.

ధాన్యం కొనుగోలులో అదనపు సౌకర్యాలు కల్పించాలి

గుండుగొలను సొసైటీ చైర్‌పర్సన్ వగ్వాల విజయవెంకటభాస్కర్

ప్రజాశక్తి - భీమడోలు

విజయవెంకటభాస్కర్

సహకార సంఘాల ద్వారా ధాన్యం కొనుగోలు ప్రక్రియ మరింత సమర్ధవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అదనపు సౌకర్యాలు కల్పించాలని గుండుగొలను విశాల సహకార సంఘం చైర్‌పర్సన్ వగ్వాల విజయ వెంకట భాస్కర్ జిల్లా కలెక్టర్‌ను, సంయుక్త కలెక్టర్‌ను కోరారు. దీనిలో భాగంగా సహకార సంఘాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసినప్పుడు ఎగుమతులు, దిగుమతులు, రవాణా, బస్తాలను కుట్టే పురికోస కొనుగోలుకు ధాన్యం కొనుగోలు ద్వారా వచ్చిన లాభాల్లో 20 శాతం ఖర్చు పెట్టేందుకు ప్రభుత్వం అనుమతించిందని, ప్రస్తుతం ఖర్చులు పెరిగిన దృష్ట్యా ఆ మొత్తాన్ని పెంచాలని కోరారు. ధాన్యం కొనుగోలుకు రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రత్యేకంగా అనుమతించిన వాలంటీర్లు ఇప్పటివరకు సహకార సంఘాలకు అందుబాటులోకి రాలేదని, దీంతో ధాన్యం కొనుగోలుకు సిద్ధంగా ఉన్న సహకార సంఘాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని చెప్పారు. రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ధాన్యం సేకరణకు అవసరమైన గోనెసంచుల సరఫరాకు ముందుకు వచ్చిందని, కానీ వాటిని రవాణాకు సిద్ధం చేసేందుకు గోనెసంచెలు కుట్టేందుకు అవసరమైన పురికొస సరఫరా విషయమే స్పష్టత ఇవ్వాలని కోరారు. ధాన్యం కొనుగోలుకు రైతు భరోసా కేంద్రాల ద్వారా నియమించిన సాంకేతిక నిపుణులకు సహకార సంఘాల ద్వారా సెల్‌ఫోన్లు అందించేందుకు అనుమతి కావాలని కోరారు. ధాన్యం కొనుగోలుకు అవసరమైన సిబ్బంది సహకార సంఘాల వద్ద అందుబాటులో లేనందు వల్ల సహకార సంఘాల ద్వారా సిబ్బంది నియామకం జీతభత్యాలు చెల్లింపు చేసేందుకు అనుమతులు ఇవ్వాలని కోరారు.

కారూమూడి సత్యనారాయణ జీవితం ఆదర్శం

ప్రజాశక్తి - చింతలపూడి

కారుమూడి సత్యనారాయణ రెడ్డిని ఆదర్శంగా తీసుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని సిపిఐ సీనియర్ నాయకులు జంగా రామచంద్రరెడ్డి పిలుపునిచ్చారు. చింతలపూడి పట్టణంలో కారుమూడి సత్యనారాయణ రెడ్డి 25వ వర్ధంతి సభ సిపిఐ మండల సహాయ కార్యదర్శి పుల్లూరి సోమశేఖర్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతలపూడి ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాతల్లో సత్యనారాయణరెడ్డి ముఖ్యులన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొని కొరియర్‌గా పనిచేస్తున్న సందర్భంలో బ్రిటీష్ ప్రభుత్వం కడలూరి జైల్లో నిర్బంధించిందని చెప్పారు. ఆనాటి తెలుగుదేశం ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచిన విధానంపై పోరాటానికి నిడదవోలు వెళ్తూ ప్రమాదానికి గురై చనిపోయారన్నారు. ఇటువంటి ఉద్యమ స్ఫూర్తి కలిగిన కారుమూడి సత్యనారాయణ రెడ్డి జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని బిజెపి మతోన్మాద విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. తొలుత సత్యనారాయణరెడ్డి విగ్రహం వద్ద సిపిఐ జెండాను శ్రీరామ ఆచార్యులు ఆవిష్కరించగా మృతవీరుల స్థూపం వద్ద జెండాను తలారి గంగరాజు, ఎఐటియుసి జెండాను జంగా రామచంద్రారెడ్డి ఆవిష్కరించారు. విగ్రహానికి సిపిఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య, సహాయ కార్యదర్శి తుర్లపాటి బాబు పూలమాలతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దంతా కృష్ణ, కారుమూడి రమేష్, కృష్ణ, వెంకటేశ్వరరావు, ఉప్పయ్ కుమార్ పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

వర్జీనియా పొగాకు రైతులు పొగాకు సాగులో రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని పొగాకు బోర్డు వేలం అధికారి మహేష్ తెలిపారు. రాసన్నగూడెంలో రైతులకు ఎరువుల వాడకంపై బుధవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పొగాకు సాగులో క్రిమి సంహారక మందులు వాడకం తగ్గించి ప్రకృతి సిద్ధ ఎరువులను వినియోగించాలని సుంచించారు. దీంతో అధిక దిగుబడులు వస్తాయని రైతులకు తెలిపారు. వరి పంట సాగు చేసిన భూముల్లో పొగాకు సాగు చేయకూడదని రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటిసి ప్రతినిధులు చారువాక్, నాగేంద్ర, సిటిఆర్ఐ ఫార్మ్ అసిస్టెంట్ రమేష్, ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మీప్రసన్న, రైతులు లక్ష్మణ్, వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట : ఎంఎల్ఎ వాసుబాబు

ప్రజాశక్తి - గణపవరం

గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల శ్రీనివాసరావు(వాసుబాబు) అన్నారు. కేశవరంలో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు గ్రామ సర్పంచి మిడతాని కామేశ్వరి అధ్యక్షత వహించారు. సభలో ఎంఎల్ఎ వాసుబాబు మాట్లాడుతూ పరిపాలన ప్రజలకు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దండు వెంకటరామరాజు, జెడ్‌పిటిసి సభ్యులు దేవవరపు సోమలక్ష్మిబాబు, ఎంపిటిసి సభ్యులు వేగేశ్న విజయదుర్గ నందిని పాల్గొన్నారు. అనంతరం గణపవరం మూడో సచివాలయ పరిధిలో స్థానిక వేలంపేటలో నిర్వహించిన గడపగడపకూ మనప్రభుత్వంలో వాసుబాబు పాల్గొని ప్రతి ఇంటి వద్దకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సూర్య బలిజ రాష్ట్ర కార్పొరేషన్ ఛైర్మన్ శెట్టి అనంతలక్ష్మి, వైసిపి నాయకులు రొంగల శ్రీను, ఎంపిటిసి సభ్యులు బత్తి సీతామహాలక్ష్మి, గణపవరం సర్పంచి మోర అలంకారం, ఉపసర్పంచి దండు రాము పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన నవరత్నాలు పేదలందరికీ ఇళ్లులో భాగంగా లబ్ధిదారులు తమకు కేటాయించిన స్థలంలో ఇంటి నిర్మాణం వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ భవానీప్రసాద్ లబ్ధిదారులకు సూచించారు. బుధవారం పురపాలక సంఘం పరిధిలోని అశ్వారావుపేట రోడ్డు గౌరీ శంకరపురం సచివాలయంలో గృహ నిర్మాణాలు చేపట్టని లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ పి.భవానీప్రసాద్ మాట్లాడుతూ లబ్ధిదారులు ఇళు కట్టడం మొదలు పెట్టకుంటే పట్టాను రద్దు చేస్తామని తెలిపారు. సబంధిత అధికారులు చొరవ తీసుకుని నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో 26వ వార్డు కౌన్సిలర్ చిటికెల అచ్యుత రామయ్య, మెప్మా సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

'గడపగపడకూ మన ప్రభుత్వం' వేగవంతం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

చింతలపూడి నియోజకవర్గంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం వేగవంతంగా జరుగుతుందని ఎంఎల్ఎ ఎలిజా అన్నారు. పట్టణంలోని ఐదో సచివాలయం పరిధిలో ఉన్న రామకుంటచెరువు వద్ద నుంచి బుధవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ ఎలిజా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, వైస్ ఛైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, వైస్ ఛైర్‌పర్సన్ కంచర్ల వాసవీరత్నం, వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మండవల్లి విజయసారథి, వైసిపి పట్టణ అధ్యక్షులు పిపిఎస్.చంద్రరావు, తాతకుంట్ల రవికుమార్, వార్డు కౌన్సిలర్లు ఉగ్గం దుర్గాప్రసాద్, షేక్ రహిమ పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : మండలంలోని నరసన్నపాలెంలో గ్రామ సర్పంచి కర్రెడ్ల ప్రభావతి ఆధ్వర్యంలో బుధవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను పొందుతున్న లబ్ధిదారులు ఎంఎల్ఎను అభినందించి హారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలవరం నియోజకవర్గంలో మూడేళ్ల కాలంలో వైసిపి ప్రభుత్వం రూ.1100 కోట్లను అభివృద్ధి, సంక్షేమ పథకాలకు వెచ్చించిందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు దాసరి శ్రీలక్ష్మి, బయ్యన్నగూడెం పిఎసిఎస్ అధ్యక్షులు తోట జయబాబు, ఎంపిటిసి మిర్యాల విజయ పాల్గొన్నారు.

అనుమతులకు లంచం అడిగారు..!

విద్యాశాఖాధికారులపై వికాస్ పాఠశాల కరస్పాండెంట్ ఆరోపణలు

జంగారెడ్డిగూడెం : పాఠశాల నిర్వహణకు రూ.ఆరు లక్షల లంచం ఇవ్వాలని విద్యాశాఖ అధికారులు ఇబ్బంది పెడుతున్నారని స్థానిక వికాస్ పాఠశాల కరస్పాండెంట్ వి.జగన్నాధరావు ఆరోపించారు. బుధవారం వికాస్ పాఠశాల ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో జగన్నాధరావు మాట్లాడుతూ విద్యా శాఖాధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో స్కూల్ అనుమతులు కోరుతూ డివైఇఒ మడకం రామన్న దొరను కలవగా రూ.6 లక్షలు లంచం అడిగారని ఆరోపించారు. జూనియర్ అసిస్టెంట్ ఫణింద్రబాబుకు స్కూల్ అనుమతుల కోసం డివైఇఒ చెప్పగా రూ.2.50 లక్షలు ఫణింద్రబాబుకు చెల్లించినట్లు తెలిపారు. అయినప్పటికీ అనుమతుల విషయంలో జాప్యం జరుగుతుందని తెలిపారు. ఈ నెల ఏడో తేదీ స్కూల్ అనుమతుల విషయంలో మాట్లాడటానికి కార్యాలయానికి రావాల్సిందిగా డివైఇఒ రామన్న దొర, ఎంఇఒ బి.రాముడు తనని పిలిపించగా అక్కడికి వెళ్లిన తనపై చులకన భావం చూపారని తెలిపారు. పాఠశాలకు అనుమతి రాదని బెదిరించినట్లు ఆరోపించారు. నిబంధనలు పాటిస్తున్న వికాస్ పాఠశాలకు అనుమతి ఇప్పించాలని, అలాగే తనకు పాఠశాల సిబ్బందికి, విద్యార్థులకు రక్షణ కల్పించాలని కోరారు. దీనిపై డివైఇఒ రామన్న దొరను వివరణ కోరగా వికాస్ పాఠశాల నిబంధనలకు విరుద్ధంగా 8, 9, 10 తరగతులు నిర్వహించడం వల్ల నోటీసులు జారి చేశామని తెలిపారు. నోటీసులు ఇచ్చినందుకు తమను చంపుతామని బెదిరించడంతో పోలీసులకు ఫిర్యాదు చేశామనే ఉద్దేశంతో నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారన్నారు తెలిపారు.

విద్యార్థులు సృజనాత్మక కార్యక్రమాల్లో పాల్గొనాలి

ప్రజాశక్తి - చింతలపూడి

విద్యార్థి దశ నుంచే సృజనాత్మక కార్యక్రమాల్లో విద్యార్థులు పోటీ పడడం వల్ల వారిలో ప్రతిభను వెలికి తీయడానికి తోడ్పడుతుందని చింతలపూడి ఎస్ఐ హరికృష్ణ చెప్పారు. స్థానిక శ్రీ చైతన్య స్కూలుకు చెందిన 14 మంది విద్యార్థులు 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి నాసా స్పేస్ సెటిల్‌మెంట్ కాంటెస్ట్‌కు ప్రాజెక్ట్ వర్క్ పూర్తి చేసి పంపించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టులో పాల్గొన్న నాసా విద్యార్థులకు బుధవారం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో చింతలపూడి ఎస్ఐ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పోటీలో పాల్గొన్న విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.సత్యనారాయణ ప్రాజెక్టుకు సంబంధించిన నమూనాను అందించారు. వారిలో ఉత్తేజాన్ని నింపేందుకు టీ షర్టులు, బుక్స్, నాసా బ్యాడ్జీలను అందించారు. ఈ కార్యక్రమంలో రీజనల్ ఇన్‌ఛార్జి పార్థసారథి, జోనల్ కోఆర్డినేటర్ ఉదయ్ భాస్కర్, ఎఒ రవీంద్ర, డీన్ మధుబాబు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

సమాజంలో అర్హత కలిగిన ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోని భావితరాలకు ఆదర్శంగా నిలవాలని నగర కమిషనర్ షేక్ షాహిద్ పిలుపునిచ్చారు. స్థానిక సిఆర్ఆర్ బి ఫార్మసీ కళాశాలలో ఓటు హక్కు వినియోగంపై బుధవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కమిషనర్ షాహిద్ మాట్లాడుతూ 18 ఏళ్లనిండిన ప్రతిఒక్కరూ ఓటర్‌గా నమోదు చేయించుకోవాలన్నారు. ఓటర్ల ముసాయిదా జాబితా పబ్లికేషన్ సందర్భంగా ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు ఓటు హక్కు, ఓటు వినియోగంపై యువతకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రలోభాలకు లోను కాకుండా తమ ఓటు హక్కును వినియోగించుకుని దేశాభివృద్ధికి యువతరం కృషి చేయాలని కమిషనర్ షాహిద్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారులు శాంతి లత, సాంబశివరావు, టిపిఎస్.శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్టేషన్ బెయిల్ మంజూరులో లంచం తీసుకున్న
ఇద్దరు కానిస్టేబుళ్లు సస్పెండ్

ఏలూరు స్పోర్ట్స్: లంచం తీసుకుని స్టేషన్ బెయిల్ మంజూరు చేసిన ఇద్దరు ఏలూరు టూటౌన్ కానిస్టేబుళ్లపై వేటుపడింది. వారిని సస్పెండ్ చేస్తూ జిల్లా ఎస్‌పి రాహుల్‌దేవ్‌శర్మ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. వివరాలిలా ఉన్నాయి. ఈ ఏడాది ఆగస్టు 13వ తేదీ అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో ఏలూరు అశోక్ నగర్‌లో ఓ వ్యక్తి రోడ్డుకు అడ్డంగా తన మోటారు సైకిల్‌ని ఉంచాడు. ఇదే సమయంలో ఎపి 29 జెడ్ 1048 నెంబర్ ఆర్‌టిసి బస్సు వచ్చింది. మోటారు సైకిల్ అడ్డు తీయాలని చెప్పడంతో ఇరువురి మధ్యా వాగ్వివాదం చోటుచేసుకుంది. దీంతో రెచ్చిపోయిన వ్యక్తి బస్సు అద్దాలను పగులగొట్టాడు. డ్రైవర్ టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం నిందితుడికి స్టేషన్ బెయిల్ మంజూరు చేసి పంపారు. అయితే స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు కానిస్టేబుళ్లు కనకారావు, సూర్యనారాయణ కలిసి తన వద్ద రూ.26 వేలు డబ్బులు తీసుకున్నారని పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై స్పందించిన ఎస్‌పి విచారణకు నూజివీడు డిఎస్‌పిని నియమించారు. ఆయన నివేదిక ఆధారంగా కానిస్టేబుళ్లను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ధాన్యం కొనుగోలు ప్రారంభం

ఉంగుటూరు: చేబ్రోలు, ఉంగుటూరు, నారాయణపురం రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లను జాయింట్ కలెక్టర్ అరుణ్‌బాబు బుధవారం ప్రారంభించారు. ఉదయం సివిల్ సప్లయాస్ డిఎం వీరపాండ్యన్ ఈ మూడు గ్రామాల్లో పర్యటించి వెళ్లారు. అనంతరం జెసి ఆయా ఆర్‌బికెల వద్ద రైతుల నుంచి ధాన్యం శాంపిళ్లను తీసుకున్నారు. నారాయణ పురంలో 17 మంది రైతులు, ఉంగుటూరులో 14 మంది రైతుల నుంచి శాంపిల్స్ సేకరించి ఆరు వేల గోనెసంచులను పంపిణీ చేశారు.

చట్టం దృష్టిలో అందరూ సమానులే

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

జాతీయ న్యాయ సేవల దినోత్సవం సందర్భంగా బుధవారం మండల న్యాయసేవాధికార కమిటీ ఆధ్వర్యంలో బుట్టాయగూడెం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులతో అవగాహనా సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఆదివాసీ ఐక్యకార్యాచరణ కమిటీ జిల్లా కార్యవర్గ సభ్యులు (పారా లీగల్ వాలంటీర్) నడపాల సోమరాజు, పారా లీగల్ వాలంటీర్ పూసం లక్ష్మణరావు మాట్లాడుతూ చట్టం దృష్టిలో అందరూ సమానులేనన్నారు. న్యాయస్థానాలవల్లే అన్యాయాలు, అక్రమాలు, దోపిడీలు, దౌర్జన్యాలు, బడుగు బలహీన వర్గాలపై దాడులు కొంతవరకైనా అదుపులో ఉంటున్నాయన్నారు. ఎవరికైనా అన్యాయం జరిగితే న్యాయస్థానాలను తప్పక ఆశ్రయించాలన్నారు. అనంతరం ఇప్పలపాడు గ్రామ మహిళ వ్యవసాయ కూలీలకు న్యాయ సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావు, విద్యార్థులు, ఇప్పలపాడు గ్రామ మహిళ వ్యవసాయ కూలీలు పాల్గొన్నారు.

అనారోగ్య బాధితునికి టిడిపి సాయం

ప్రజాశక్తి - చింతలపూడి

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవటమే మానవత్వం అని టిడిపి నాయకులు మారుమూడి థామస్ అన్నారు. చింతలపూడి పట్టణంలో మండలంలోని యండపల్లి మల్లేశ్వరం గ్రామానికి చెందిన ఎడ్ల బలరాం ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. దీంతో నిర్మాణ దశలో తన ఇల్లు ఆగిపోయింది. రాజీవ్ థామస్ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రూ.ఏడు వేల విలువైన గృహ నిర్మాణ సామగ్రి బలరాం కుటుంబానికి బుధవారం అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు బోడా నాగభూషణం పాల్గొన్నారు.

సమగ్ర రీ సర్వే ముగింపు

ప్రజాశక్తి - భీమడోలు

రెవెన్యూ డివిజన్ పరిధిలో వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు - భూ రక్ష పథకం అమలులో భాగంగా పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపికైన మండలంలోని కోడూరుపాడులో సమగ్ర రీసర్వే కార్యక్రమం బుధవారంతో ముగిసిందని తహశీల్దార్ జాన్‌రాజు తెలిపారు. సమగ్ర రీ సర్వే గ్రామసభను గ్రామ సర్పంచి ఎం.నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సర్వే శాఖ సహాయ సంచాలకులు సర్వే వివరాలను పరిశీలించారు. స్థానికులు మరొకమారు లేవనెత్తిన అభ్యంతరాలను నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రాఘవన్, సర్వేయర్ ధర్మారావు, గ్రామపంచాయతీ కార్యదర్శి వెంకట్రావు పాల్గొన్నారు.

నేడు నూజివీడులో విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - నూజివీడు

నూజివీడు పట్టణంలో కొత్త లైన్లు ఏర్పాటు కారణంగా గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎపి సిపిడిసిఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ డి.కృష్ణనాయక్ తెలిపారు. నూజివీడు కార్యాలయంలో ఆయన బుధవారం మాట్లాడుతూ ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పట్టణ పరిధిలోని నెహ్రూపేట, టౌన్ చర్చ్ రోడ్డు, శైలజ ఆసుపత్రి రోడ్డు, అజరయ్యపేట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించే దిశగా కొత్త లైన్ల ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. వినియోగదారులకు కలిగిస్తున్న అసౌకర్యానికి చింతిస్తున్నామని, ప్రజలు సహకరించాలని కృష్ణనాయక్ కోరారు.

వేలం ప్రకటన

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
ఇ.పి.నెం.23/2019 ఇన్
ఓ.ఎస్.నెం.47/2015

బిట్వీన్:
చెల్లూరి వెంకట రమేష్ అనే రమేష్ ...డి. హెచ్. ఆర్
మరియు
యడ్డపల్లి లీలావతి ...జె.డి.ఆర్

పై జె.డి.ఆర్. తాలూకు యాదిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని డి. హెచ్.ఆర్. తాలూకు డిక్రీ బాకీ నిమిత్తము మరియు ఖర్చులు దర్మిలా వడ్డి రాబట్టుకొను నిమిత్తము దిగువ షెడ్యూలు ఆస్తిని **ది.25-11-2022 తేదీ ఉదయం 10:30 ని॥ల లగాయితు పై కోర్టులో వేలం జరుగును.** ఆసక్తి గలవారు వేలము షరతులకు లోబడి పాడుకొనవచ్చును.

SCHEDULE

West Godavari District, Tadepalligudem Sub division, Tadepalligudem Mandal, Metta upparagudem village hamlet of Kunchanapalli village, bearing R.S.No. 37/1 Total extent of Ac.2-54 cents in which easternside Ac. 1-54 cents in which easternside Ac. 0.52 cents in which easternside south side 5515 square links i.e. 267 square yards or 223.24square meters are bounded by:

Item-I: ***East:*** Gorinta Venkata Siva Ramaraju land 6 links, ***South:*** Gorinta Venkata Siva Ramaraju land 60 links. ***West:*** 4 yards width road 6 links, ***North:*** Item-II - 63 links.

With in the above boundaries the above site is an extent of 349 square links or 18 square yards site with all easement rights.

Item-II: ***East:*** Gorinta Venkata Siva Ramaraju land 75 links, ***South:*** Item-1 63 links. ***West:*** 4 yards width road 71 links, ***North:*** Vendors remaining land 63 links.

With in the above boundaries the above site is an extent of 5149 square links i.e. 249 square yards of vacant site as such Item-I and Item-II schedule properties total extent of site is comes to 267 square yards of vacant site with all easement rithts etc.,

DHR's Value : Rs.3,00,000/-
Amin Value : Rs.5,90,000/-

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులకు లోబడి)

Sd/- PEDAGADI H.V.N.S.BHUPAL
Advocate, Tadepalligudem.
Cell: 98497 93138
Tadepalligudem,
05-11-22.